ప్రశాంతంగా ప్రార్థనలు

రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా పాతబస్తీ మక్కా మసీదులో, పరిసర ప్రాంతాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు బందోబస్తును పర్యవేక్షించారు. అలాగే గోల్కొండలోని జామా మసీదులతో పాటు స్థానిక మసీదులలో జరిగిన ప్రార్థనలకు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

– చార్మినార్, గోల్కొండ






గోల్కొండలో..



కాంగ్రెస్‌లో చేరిన బత్తుల

నాంపల్లి: బీఆర్ఎస్ నేత బత్తుల మనోహర్ బాబు శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌కు చెందిన బత్తుల మనోహర్ బాబు ఖైరతాబాదు ఎమ్మెల్యే దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన బత్తుల మనోహర్ బాబుకు మహ్మద్ అలీ షబ్బీర్ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.



మంత్రి సీతక్కకు సన్మానం



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి దనసరి సీతక్కకు చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఆర్.రాజు ముదిరాజ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సన్మానించారు.

రంజాన్‌కు అన్ని ఏర్పాట్లు చేపట్టండి

అబిడ్స్: రంజాన్ పండుగకు అన్ని మసీదులు, ఈద్గా మైదానాల వద్ద భారీ ఏర్పాట్లు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన మైనార్టీలతో కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంతో పాటు గ్రేటర్ నలుమూలలా ఈద్గాలు, దర్గాలు, మసీదుల వద్ద అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వేగవంతంగా ఏర్పాట్లు చేయాలన్నారు. వేసవి కావడంతో మంచి నీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే రంజాన్‌కు భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు హామీ ఇచ్చారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఆనంద్‌కుమార్ గౌడ్

‘అత్యధిక ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీవే’

అబిడ్స్: అత్యధిక పార్లమెంటు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ నాయకుడు, రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూంకుంట అరుణ్ కుమార్ పేర్కొన్నారు. బొమ్మరాజు కృష్ణ మూర్తి, బర్ల సత్యనారాయణ యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీ తుక్కుగూడలో నిర్వహించే జన జాగరణ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం తూంకుంట అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీతోనే పేద బడుగువర్గాల సంక్షేమం కొనసాగుతుందన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రిగా రాహుల్‌గాంధీ అయితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షించిన తూంకుంట అరుణ్‌కుమార్

టీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉదయశ్రీ రెడ్డి



అఫ్జల్‌గంజ్: ప్రముఖ విద్యావేత్త ఇట్టా ఉదయశ్రీరెడ్డిని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టీసీ రాష్ట్ర కార్యాలయంలో కార్యవర్గ సమావేశంలో ఇట్టా ఉదయ్‌శ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఇట్టా ఉదయశ్రీరెడ్డి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. 20 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, కేన్సర్, క్షయ వ్యాధి నివారణకై, గుండె, చక్కెర వ్యాధి, హైపర్ టెన్షన్, జాతీయ సమైక్యత, విద్యార్థిని మహిళా సంక్షేమ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారు.

కేసీఆర్ కపట ప్రేమను ప్రజలు నమ్మరు



గౌరి సతీష్

అబిడ్స్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులపై, ప్రజలపై కపట ప్రేమను చూపిస్తే వారు నమ్మే స్థితిలో లేరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ఏ ఒక్కరోజు అయినా స్థానికులకు కానీ, రైతులకు కానీ ముఖాముఖి కలిశారా..? అని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లో ఉంటూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేసిన కేసీఆర్‌కు ప్రజలు బుద్ధిచెప్పినా ఇంకా మేల్కోవడం లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు అహంకారంగా ప్రవర్తిస్తూ ప్రజల అభివృద్ధిని విస్మరించారన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్‌ల పార్టీకి ఒక్క సీటుకూడా రాదని గౌరి సతీష్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోజుకు 20 గంటలు ప్రజల మధ్యనే ఉండి ప్రజల వికాసానికి కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.

గాజులు ఘల్లుమంటున్నాయ్!

- కిటకిటలాడుతున్న లాడ్‌బజార్
- ఓవైపు రంజాన్ మాసం.. మరోవైపు పెళ్లిళ్ల సీజన్‌కావడంతో సందడిగా దుకాణాలు
- ప్రత్యేక ఆఫర్లతో కిక్కిరిసిపోతున్న గాజుల మార్కెట్



లాడ్‌బజార్‌లోని ఓ దుకాణంలో వినియోగదారుల సందడి

చార్మినార్: లాడ్‌బజార్‌లో రంజాన్ మార్కెట్ జోరుగా కొనసాగుతోంది. దుకాణాలన్నీ మహిళలతో కళకళలాడుతున్నాయి. ఉదయం నుంచి మరుసటి రోజు తెల్లవారు జాము వరకు తెరిచే ఉంటున్నాయి. రాత్రిపూట విద్యుత్ దీప కాంతుల్లో లాడ్‌బజార్ గాజుల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. లాడ్‌బజార్ గాజుల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో కేవలం నగర ప్రజలే కాకుండా తెలంగాణ జిల్లాల నుంచి మహిళలు ఇక్కడికి వచ్చి తమకు నచ్చిన గాజులను ఖరీదు చేస్తున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా మహిళలు తమకు ఇష్టమైన రంగు రంగుల గాజులను ఖరీదు చేయడంలో నిమగ్నమయ్యారు. రూ.5 నుంచి 10వేల రూపాలయ వరకు ఖరీదు చేసే ఇక్కడి గాజులు హిందు, ముస్లిం అనే తారతమ్యం లేకుండా అందరికీ కావాల్సిన డిజైన్‌లలో అందుబాటులో ఉన్నాయి. అందుకే వయసుతో నిమిత్తం లేకుండా పెద్దవాళ్లు, యువతులు, పిల్లలు ఇక్కడి గాజుల పట్ల మోజు పెంచుకుంటున్నారు.

కిక్కిరిపోతున్న దుకాణాలు..

ఓవైపు రంజాన్ మార్కెట్ కొనసాగుతుండగా.. మరోవైపుపెళ్లిళ్ల సీజన్ కావడంతో లాడ్‌బజార్ గాజుల దుకాణాలు వినియోగదారులతో కిక్కిరిపోతున్నాయి. ఇక పెళ్లిళ్ల సందర్భంగా లాడ్‌బజార్‌ను సందర్శించకుండా వివాహ వేడుకలు చేయలేని వారుండరు. పెళ్లి కూతురుకు విభిన్న రూపాల్లోని గాజులను ఖరీదు చేయడానికి ఇష్ట పడుతారు. అంతేకాకుండా పెళ్లి కూతురును చేసే సమయంలో ఆహ్వానితులుగా వచ్చే అతిథులందరికీ గాజులను అందజేయడం ఆనవాయితీగా మారడంతో పెళ్లి కూతురుతో పాటు అతిథులకు బహుమతిగా ఇచ్చే గాజులను కూడా లాడ్‌బజార్‌లో ఖరీదు చేయడానికి చాలా మంది ఇష్ట పడుతుంటారు. అందుకే దూరపు ప్రాంతాల నుంచి లాడ్‌బజార్‌కు అధిక సంఖ్యలో వినియోగదారులు వస్తున్నారు.

చార్మినార్ పక్కనే..

చార్మినార్ పడమర వైపు పాదం దగ్గర పుట్టిన ఒక వెలుగుల వీధి లాడ్‌బజార్. ప్రస్తుతం లాడ్‌బజార్‌లో దాదాపు 250కి పైగా దుకాణాలు రోజు తమ వ్యాపార లావాదేవీలు కొనసాగిస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా ప్రత్యేకమైన ఆఫర్లతో లాడ్‌బజార్‌లోని గాజుల దుకాణదారులు వినియోగదారులకు మరింత చేరువయ్యారు. ఆఫర్లకు ఆకర్షితులవుతున్న వినియోగదారులు గాజుల కొనుగోలు కోసం ఉత్సాహం చూపిస్తున్నారు. ప్రస్తుతం లాడ్‌బజార్ రంజాన్ మార్కెట్‌లో ఎటు చూసినా సందడే..సందడి కనిపిస్తుంది. సాధారణ రోజుల్లో నిత్యం రద్దీగా ఉండే లాడ్‌బజార్ ప్రస్తుతం రంజాన్ మాసంతో పాటు పెళ్లిళ్ల సీజన్ కావడంతో మరింత రద్దీగా మారింది.

‘పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం’

గోల్కొండ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి ఆధిపత్యం చాటుతుందని ఆ పార్టీ సీనియర్ నాయకులు కంది మోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ కాలం చెల్లిన పార్టీ అని ఆ పార్టీ పార్లమెంటు ఎన్నికలతో పూర్తిగా కనుమరుగు అవుతుందన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి మరో కేసీఆర్‌ల వ్యవహరిస్తున్నారని పార్లమెంటు ఎన్నికల్లో ఆయనకు కూడా ప్రజలు గుణపాఠం నేర్పడం ఖాయమన్నారు. పదేళ్ల ప్రధాని మోదీ పాలనను తెలంగాణ ప్రజలు ఆమోదిస్తున్నారని ఆ కారణంగానే తెలంగాణలో తమ పార్టీ అత్యధిక స్థానాలు గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాంపల్లి: రైలు ఢీకొని గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని యువకుడు(30) హఫీజ్‌పేట్–చందానగర్ రైల్వే స్టేషన్ల మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా అటుగా వచ్చిన గుర్తు తెలియని రైలు ఢీకొట్టింది. గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఉస్మానియా మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై ఎరుపు రంగు టీ షర్టు, నీలం రంగు ప్యాంటును ధరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పవిత్ర అక్సా మసీదు పాలస్తీనాదే

గోల్కొండ: అక్సా మసీదు ముమ్మాటికి పాలస్తీనా ప్రజలదేనని ఇరాన్‌కు చెందిన ప్రముఖ ఇస్లామిక్ శాస్త్రాల నిపుణుడు ఖారీ మహ్మద్ జవాద్ ఖషాఫ్ అన్నారు. శుక్రవారం గోల్కొండ దిలావర్‌షానగర్‌లోని అక్తరీ మసీదులో అక్సా మసీదు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు అనే అంశంపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాలస్తీనాపై వరుసగా ఇజ్రాయిల్ దాడులు చేస్తూ మానవతా విలువలను కాలరాస్తుందని ఆరోపించారు. ఇస్లాంలో అక్సా మసీదుకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. అనంతరం అక్సా మసీదుపై ఆయన రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్, ఖారీ అబ్దుల్ సయ్యద్, ఖారీ మహ్మద్ హుస్సేన్, అజీజ్‌ఖాన్ పఠాన్, గులాం మొహియుద్దీన్ పాషాభాయ్, ఖారీ నూరుద్దీన్ తదితరులున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఖారీ మతీన్ ఆలీషా తదితరులు

‘కవి సాయంత్రం’ గ్రూప్ ప్రధాన కార్యదర్శిగా లహరి



అబిడ్స్: ప్రముఖ సోషల్ మీడియా గ్రూప్ ‘కవి సాయంత్రం’ గ్రేటర్ హైదరాబాద్ కమిటీలో కవి ఎన్. లహరి ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కవి సాయంత్రం గ్రూప్ అనేది ప్రముఖ సాహిత్య, స్వచ్ఛంద సేవా సంస్థ జన జాగృతి కళాసమితిలో అంతర్భాగమని ఆయన అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విడివిడిగా కమిటీలను నియమించామన్నారు. తెలుగు భాషా వికాసం కోసం, ఔత్సాహికులలో సాహిత్యాన్ని మరింత పెంపొందించడం కోసం ఈ సమూహం పనిచేస్తుందని తెలిపారు. ఈ నియామకం 2 సంవత్సరాల వరకు వర్తిస్తుందని సంత్ పేర్కొన్నారు. కాగా తనపై అభిమానంతో ఈ బాధ్యత అప్పగించినందుకు ఎస్.లహరి కృతజ్ఞతలు తెలుపుతూ తన శక్తి మేరకు గ్రూప్ కోసం పని చేస్తానన్నారు.

చీఫ్ జడ్జిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



యాకుత్‌పురా: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారాను గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. ఉపాధ్యక్షురాలు ప్రవీణారెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బకా హర్షవర్ధన్, సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేష్ కుమార్, లైబ్రరీ కార్యదర్శి సుధాంశు కుమార్, కోశాధికారి విశాల్ సింగ్, క్రీడాలు, సాంస్కృతిక కార్యదర్శి రామిణి సైదిరెడ్డి, లేడి రిప్రేసేంటేటివ్ జశ్వంత్ కౌర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



యోగ్ రాజ్‌ను సన్మానిస్తున్న శివకుమార్ యాదవ్, లక్ష్మీనారాయణ, సంతోష్

జియాగూడ: తెలంగాణ రాష్ట్ర బీజేవైఎం కోశాధికారిగా నియమించబడిన ఠాకూర్ యోగ్ రాజ్ సింగ్‌ను శుక్రవారం నియోజకవర్గానికి చెందిన బీజేపీ అనుబంధ సంస్థల నాయకులు ఘనంగా సన్మానించారు. జియాగూడ నుంచి కార్వాన్ నియోజకవర్గం డెయిరీ సెల్ కన్వీనర్ బి.శివకుమార్ యాదవ్, జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జె.లక్ష్మీనారాయణ, సంతోష్ రేపక యోగిరాజ్ సింగ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా యోగిరాజ్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికలకు కార్వాన్ నియోజకవర్గం నుంచి అభ్యర్థి మాధవీలతకు మంచి ఓటు బ్యాంకును అందించడానికి కృషి చేస్తున్నామన్నారు.

‘కలిసికట్టుగా ముందుకు సాగుతాం’



యోగ్ రాజ్‌సింగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: అందరితో కలిసి ముందుకు సాగుతానని బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి పి.యోగ్ రాజ్‌సింగ్ అన్నారు. బీజేవైఎం కోశాధికారిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం ఆయనను పలువురు బీజేపీ, బీజేవైఎం, కిసాన్ మోర్చా నాయకులు గుడిమల్కాపూర్‌లోని కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని మోదీ విజయాలను ప్రజలకు వివరించడంలో బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు విజయం సాధించారన్నారు. తెలంగాణలో పదేళ్ల అవినీతి బీఆర్ఎస్ సర్కార్‌కు ప్రజలు గుణపాఠం నేర్పారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను కూడా ప్రజలు ఈ పార్లమెంటు ఎన్నికల్లో గట్టి గుణపాఠం నేర్పుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజ్వర్‌సింగ్, సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

ప్రత్యేక పూజలు



లాల్‌దర్వాజా అమ్మవారిని దర్శించుకున్న మెట్టు సాయికుమార్ దంపతులు

చాంద్రాయణగుట్ట: లాల్ దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారిని రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ కుటుంబసభ్యులకు మాజీ చైర్మన్ కె.వెంకటేష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించారు. వీరితో పాటు సీఎస్ శాంతి కుమారీ పీఎస్ సుమంత్, ముఖ్యమంత్రి సలహాదారుడు నరేందర్ రెడ్డి పీఏ సాయి కుమార్ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో నీటి సమస్యకు చెక్



గోల్కొండ: గణేష్ ఘాట్ హిందూ శ్మశాన వాటికలో కొత్త బోరును వేశారు. దీంతో ఈ శ్మశాన వాటికలో నీటి కొరత తీరింది. కొన్ని నెలలుగా ఈ శ్మశాన వాటికలోని పాత బోరు నీరు లేక ఇంకిపోయింది. శ్మశాన వాటికకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడే వారు. శ్మశానవాటిక అభివృద్ధి కమిటీ వారు కొత్త బోరును వేశారు. ఈ బోరులో నీరు బాగా పడినందున శ్మశానవాటిక కమిటీ ప్రతినిధి టి.అమర్‌సింగ్ హర్షం వ్యక్తం చేశారు. శ్మశానవాటికలో అవసరమైన అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని ఆయన అన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, అనధికారులు జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని సూచించారు.

– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



మజ్జిగను పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



షేక్‌పేటలో..



నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్



సిటీ సివిల్ కోర్టులో..



నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ సాగర్, బాబు తదితరులు

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ పార్టీలో ఎమ్మెల్యే కౌసర్‌తో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసాల బజార్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సు, కుల మతాలతో సంబంధం లేకుండా అందరు ఒకే వేదికపై కలిసే అపూర్వ ఘట్టం ఇఫ్తార్ విందులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, ఖాలేద్ ఆలీఖాన్, కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులపై దాడి.. ఇద్దరిపై కేసు

సుల్తాన్‌బజార్: షూ విషయమై తలెత్తిన ఘర్షణలు ఇద్దరికి గాయాలపాలైన ఘటన శుక్రవారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం..అనిల్ కుమార్ కోఠిలోని కామంత్ హోటల్ పక్కన కాలేజ్ షూస్ షాప్ నిర్వహిస్తున్నాడు. అస్గర్ అనే వ్యక్తి షూలు కొనేందుకు వచ్చి మాటామాటా పెరగడంతో అనిల్‌పై చెయ్యి చేసుకున్నాడు. ఈ విషయమై అనిల్ తన అన్న హుస్సేనప్పకు సమాచారం అందించడంతో హుస్సేనప్ప తన కజిన్‌తో అనిల్ షాప్‌కు వచ్చి గొడవ పడిన అస్గర్‌ను నిలదీయడంతో అస్గర్ అతనిపై బీరు బాటిల్‌తో దాడి చేశాడు. అస్గర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు సంవేత్‌ఖాన్, మహబూబ్‌లు సైతం వారిపై దాడి చేయడంతో వారికి మెడ, నుదిటి భాగంలో గాయాలయ్యాయి. దీంతో హుస్సేనప్ప సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితులను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

7న పాతబస్తీలో వివిధ వ్యాధులపై అవగాహన ర్యాలీ

చార్మినార్: తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 7న ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పూల్ బాగ్ చమన్ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో వివిధ వ్యాధులపై అవగాహన శిబిరంతో పాటు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజ్ జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభాలక్ష్మి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ఫౌండర్ కార్యదర్శి డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు.